ఈనాడు

# సౌర, పవన విద్యుత్ ఒకేచోట

## హైబ్రిడ్ పద్ధతే కీలకం

### కేపీ గ్రూపు ఛైర్మన్ ఫరూక్ జి.పటేల్



ఈనాడు, హైదరాబాద్: పర్యావరణహితంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా మారుతోందని కేపీ గ్రూపు ఛైర్మన్ ఫరూక్ జి.పటేల్ అన్నారు. గతంలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు విడివిడిగా ఉండేవని, రాబోయే దశాబ్దంలో హైబ్రిడ్ పద్ధతి ఈ రంగాన్ని సమూలంగా మారుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇంధన ఉత్పత్తిలో ఉండే అంతరాయాలను ఈ వ్యవస్థలు తొలిగిస్తాయన్నారు. ఫలితంగా గ్రిడ్ నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం నిరంతర హరిత ఇంధన సరఫరా జరుగుతుందని వివరించారు. భారత సౌర విద్యుత్ రంగంలో అధిక విద్యుత్ సామర్థ్యంతో ఉన్న బైఫేషియల్ మాడ్యూళ్ల (రెండు వైపుల నుంచీ సౌర శక్తిని గ్రహించేవి) కీలకం కానున్నాయని పేర్కొన్నారు. దీంతో పాటు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు స్థల ఎంపిక దగ్గర్నుంచి, వాతావరణ అంచనాలు, నిర్వహణ ఖర్చులను తగ్గించడంలో కృత్రిమ మేధ పాత్ర పెరగనుందని తెలిపారు. పగలు ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నిల్వ చేసి, అవసరమైనప్పుడు వాడుకునేందుకు బ్యాటరీ వ్యవస్థలూ ముఖ్యమని పేర్కొన్నారు. 2030 నాటికి స్వచ్ఛ ఇంధన లక్ష్యాన్ని చేరుకోవాలంటే, పరిశ్రమ వర్గాలు కేవలం ప్రాజెక్టుల విస్తరణకే పరిమితం కావద్దన్నారు. సరఫరా వ్యవస్థను స్థానికీకరించడంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. దేశీయంగా తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గుల ప్రభావం తగ్గుతుందని పేర్కొన్నారు. నైపుణ్యమున్న శ్రామిక శక్తిని తయారు చేయడం, డిజిటల్ సామర్థ్యాలను పెంచుకున్నప్పుడే అంతర్జాతీయ సంస్థలతో భారతీయ కంపెనీలు పోటీ పడగలవని ఫరూక్ పటేల్ విశ్వాసం వ్యక్తం చేశారు.